సాక్షి విజయనగరం

సోమవారం ၊ 25 ၊ ఆగస్టు ၊ 2025



ప్రకృతికి నచ్చేలా..

మట్టి వినాయక విగ్రహాలకు బాడంగి మండలంలోని పాల్తేరు పెట్టింది పేరు. గ్రామానికి చెందిన కుమ్మరి కులస్తులు తరరాలుగా మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు.

- 8లో



నాన్నా..లే నాన్న..

విద్యుదాఘాతంతో తండ్రి మృతి చెందగా.. అతని చేయి పట్టుకుని లే నాన్న.. లే అంటూ కుమారుడు రోదించిన తీరు చూసి అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు.

- 8లో



సైబర్ మోసాలపై అప్రమత్తం - 8లో

సైబర్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఎటువంటి వ్యక్తిగత సమాచారం చేరవేయవద్దని రిజర్వ్ బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య సూచించారు.

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంతోపాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక–మీకోసం కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అర్జీదారులు వారి అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి 'మీకోసం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. నమోదైన అర్జీల గురించి, వాటి పరిష్కార స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

స్థిరంగా మడ్డువలస నీటిమట్టం



మడ్డువలస ప్రాజెక్టు వద్ద నీటిమట్టం

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం స్థిరంగా ఉంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు వద్ద 64.47 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. కుడి ప్రధాన కాలువ ద్వారా 700 క్యూసెక్కుల నీటిని పంటపొలాలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ఉన్న 11 గేట్లను అధికారులు మూసివేశారు.

కళారంగంలో సంగీతం ఓ భాగం

పద్మశ్రీ యడ్ల గోపాలరావు



ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న యడ్ల గోపాలరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాజాం సిటీ: కళారంగంలో సంగీతం ఓ భాగమని, కళ, సంగీతం కవల పిల్లలు వంటివని పద్మశ్రీ యడ్ల గోపాలరావు అన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన లలిత కళాసమాఖ్య రాజాంకు చెందిన ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మంతపూడి ప్రసాదరావుకు సంగీత సామ్రాట్ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రసాదరావుకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో యడ్ల గోపాలరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి యువతకు నానాటికీ సంగీతంపై మక్కువ తగ్గిపోతుండడం దురదృష్టకరమన్నారు. మనసు గాయాన్ని మాన్పించేది సంగీతమేనని అటువంటి సంగీతంపై మక్కువ పెంచుకోవాల్సిన ఆవశ్యకత యువతపై ఎంతైనా ఉందని హితవుపలికారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, మానవతా సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, రోటరీ అధ్యక్షుడు గట్టి పాపారావు, మెట్ట దామోదరరావు, మజ్జి మదన్‌మోహన్, అన్నెపు కామేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల తయారీపై వర్క్‌షాపులు

పార్వతీపురం టౌన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత వినాయక విగ్రహాల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమికల్ రంగులతో తయారు చేసిన విగ్రహాల వాడకాన్ని తగ్గించి, మట్టి విగ్రహాల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

పింఛనర్ల కంటకన్నీరు..!

ఈ దీనులు ఏ దేవుడికి నివేదించుకోగలరు. వారి మొర ఆలకించేదెవరు? ఏ ప్రజాప్రతినిధి, ఏ అధికారి వారి సమస్యలను పరిష్కరిస్తారు? ఏళ్ల తరబడి అందుకుంటున్న వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లకు మీరు అర్హులు కారంటూ వస్తున్న నోటీసులు అందుకుంటున్న లబ్ధిదారుల వ్యథ వర్ణనాతీతంగా ఉంది. వృద్ధులు, దివ్యాంగుల కళ్ల వెంట రక్తపు చుక్కలు జాలువారుతున్నాయి.

- కొత్తవి ఇవ్వరు..ఉన్నవి ఏరివేత
- రోడ్డున పడిన వృద్ధులు, దివ్యాంగులు
- పదేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న వారు అనర్హులంటూ తాఖీదులు
- నివ్వెరపోతున్న లబ్ధిదారులు



విజయనగరం గంటస్తంభం:

అవ్వాతాతలు అందుకుంటున్న పింఛన్లు ఎడాపెడా కత్తిరిస్తున్న చంద్రబాబు సర్కారు అనైతికంగా వ్యవహరించేందుకు వెనుకాడడం లేదు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటినే ఏరివేస్తోంది. కనీసం దివ్యాంగుల పట్ల కూడా దయ చూపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 2024 ఎన్నికల ముందు నాటికి విజయనగరం జిల్లాలో విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగుల పెన్షన్‌కు సంపూర్ణ అర్హత కలిగిన వారు మొత్తం 36,550 మంది. వారిలో 7వేల మందికి అనవసర అభ్యంతరాలు పెట్టి వాటిని సరిచేసుకోవాలని లేని పక్షంలో పెన్షన్ రద్దు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటివద్దే పారదర్శకంగా వలంటీర్ల ద్వారా పెన్షన్ అందించగా..టీడీపీ కూటమి సర్కారు ఆ పారదర్శకతను తుంగలో తొక్కింది.

ఇప్పటికే పండుటాకులకు పింఛన్లు తొలగించి అవస్థలకు గురి చేస్తున్న కూటమి సర్కారు.. తాజాగా దివ్యాంగులను టార్గెట్‌గా చేసుకుని ఎడాపెడా కోతలు పెడుతోంది. మళ్లీ మళ్లీ సదరం సర్టిఫికెట్లు తేవాలంటూ, వైద్య పరీక్షలు, వైకల్య శాతం కుదింపుతో ముప్పు తిప్పలు పెడుతోంది. 40శాతం కంటే తక్కువగా వైకల్యం ఉందని, పింఛన్‌కు అనర్హులంటూ ప్రతి జిల్లాలో వేల సంఖ్యలో లబ్ధిదారులకు నోటీసులు జారీ అవుతున్నాయి.

ఎన్నో ఏళ్లుగా నెలనెలా అందే పింఛన్‌నే నమ్ముకుని బతుకుతున్న దివ్యాంగులను చంద్రబాబు సర్కారు నిర్దయగా రోడ్డుకీడ్చేసింది. ఇన్నాళ్లూ నిబ్బరంగా తీసుకుంటున్న పింఛన్‌కు ఇకపై మీరు అనర్హులంటూ వారం, పది రోజులుగా కూటమి ప్రభుత్వం ఇస్తున్న నోటీసులతో పింఛన్ దారులు కకావికలమవుతున్నారు. దివ్యాంగులు కొంత మంది ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగుతున్నారు. చంద్రబాబు సర్కారు మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని పెన్షన్లు కోల్పోతున్న దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు.

తలపట్టుకుంటున్న టీడీపీ నాయకులు..

దివ్యాంగుల్లో అనర్హుల పింఛన్లు రద్దు వ్యవహారం వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్న టీడీపీ నేతలకు శరాఘాతంలా మారింది. మన్నుతిన్న పాముల్లా మింగలేక కక్కలేక సతమతమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం వచ్చే స్థానిక ఎన్నికల్లో దెబ్బతీస్తుందన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. గత లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశం దక్కనివారు, పోటీచేసి ఓడిపోయినవారు అప్పట్నుంచి మళ్లీ పోటీకి అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటూ వస్తున్నారు. అతికష్టంపై ఐదేళ్లుగా మద్దతుదారులను కేడర్‌ను కాపాడుకుంటూ ఎన్నికలు ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో స్థానిక ఎన్నికల్లో తమదే గెలుపంటూ ఊహల్లో విహరిస్తున్నారు. ఇప్పుడు వారంతా తలలు పట్టుకుంటున్నారు.

పెన్షన్ల కుదింపు సిగ్గుచేటు

ప్రభుత్వ ఆదాయం మిగులు కోసం దివ్యాంగ, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు కుదించాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయం సిగ్గుచేటు. నేటి వరకు అర్హులైన వారికి ప్రభుత్వం చెల్లిస్తున్న సామాజిక పెన్షన్లలో కోతలు విధించడం దుర్మార్గపు చర్య. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్లలో 7వేల మందికి అనవసర అభ్యంతరాలు పెట్టి వాటిని సరిచేసుకోవాలని లేనియెడల పెన్షన్లు రద్దు చేస్తున్నట్టు నోటీసులు ఇవ్వడం వల్ల మంచాన పడి కదలలేని స్థితిలో ఉన్న వారు మళ్లీ అర్హులమని నిరూపించుకోడానికి అధికారుల చుట్టూ తిరగలేక తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. పెన్షన్ల రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి.

–బుగత అశోక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

దివ్యాంగుల జీవితాలతో ఆటలు



విజయనగరం జిల్లాలో సుమారు 7వేల మంది దివ్యాంగుల పెన్షన్లు రద్దు చేయడం అత్యంత హేయం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన పెన్షన్ల కంటే, ఎక్కువ మందికి ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పింది. కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా. పాతవి అక్రమంగా తొలగించడం దుర్మార్గం. పెన్షన్ల రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదు.

–రెడ్డి శంకరరావు, సీపీఎం నగర కార్యదర్శి,



అల్లబోయిన సత్యవతి

బొబ్బిలి: ఈమె పేరు అల్లబోయిన సత్యవతి. భర్త అప్పలనర్సయ్య చనిపోయి చాలా ఏళ్లయింది. పుట్టుకతోనే మూగ అయిన ఆమె జీవనానికి ప్రభుత్వం అందజేస్తున్న వికలాంగ పింఛనే ఆధారం. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ ఒక్క ఆధారాన్ని తీసివేసింది. ఇలా ఈమె ఒక్కరే కాదు..ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 80 వేల మంది పింఛన్ పొందుతున్న దివ్యాంగుల్లో వేలాది మందికి మీ పింఛన్లు తొలగిస్తున్నామంటూ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వారంతా ఇప్పుడు తమ అర్హత ధ్రువీకరణ పత్రాలను పట్టుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కానీ వారి పింఛన్ పునరుద్ధరిస్తారో లేదోనని ఆందోళన చెందుతున్న దివ్యాంగులంతా సోమవారం కలెక్టరేట్ వద్ద తమ ఆవేదన వెళ్లగక్కనున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, నియోజకవర్గాల వారీగా ఉన్న దివ్యాంగులకు అండగా ధర్నాకు తరలిరానున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు దివ్యాంగుల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తూ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు విజయనగరం కలెక్టరేట్ వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల నిరసన అనంతరం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందివ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆవేదనకు అండగా

- దివ్యాంగుల పోరాటానికి వైఎస్సార్‌సీపీ నేతృత్వం
- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా



వీఆర్వోకు షోకాజ్

- విచారణకు ఆదేశించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరంఫోర్ట్: రెవెన్యూశాఖలో మ్యుటేషన్ కోసం రైతుల నుంచి రెవెన్యూ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారనే అంశంపై సాక్షిలో ఆదివారం 'మ్యుటేషన్ కావాలంటే ముట్టజెప్పాల్సిందే..!' శీర్షికన ప్రచురించిన కథనానికి రెవె న్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు బొండపల్లి మండలం మరువాడ కొత్తవలస (ఎం.కొత్తవలస) వీఆర్వో కడారి కుమార్‌కు తహసీల్దార్ డోల రాజేశ్వరావు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అంతేకాకుండా విచారణకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను నియమించారు. విచారణ నివేదిక అందగానే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

డీఎస్సీ సెలక్షన్ లిస్టుపై టెన్షన్


- రెండు రోజుల్లోనే సర్టిఫికెట్ల పరిశీలన ప్రకటనపై ఆందోళన

విజయనగరం అర్బన్: టీచర్ పోస్టుల నియామకాలకు సంబంధించిన డీఎస్సీ–2025 మెరిట్ జాబితాను ఎట్టకేలకు విడుదల చేసిన ఆనందం అభ్యర్థుల్లో కనబడడంలేదు. మెరిట్ జాబితా విడుదల వ్యక్తిగతంగా చేపట్టడం, సెలక్షన్ లిస్ట్ రెండు రోజుల్లోనే విడుదల చేస్తామనడం వంటి సమస్యలు వారిలో పలు ఆనుమానాలు, ఆందోళనకు గురిచేస్తున్నాయి. సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన అంటూ శనివారం ప్రకటించారు. పరిశీలనకు సంబంధించిన ఏర్పాట్లను ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఇప్పటికే పూర్తి చేసింది. సెలక్షన్ లిస్ట్ వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం వల్ల మెరిట్ జాబితా నుంచి సెలక్షన్ జాబితాలోకి ఎవరు వెళ్తారో ఎవరు వెళ్లరో అన్న సందేహాలు, ఒక వేళ సెలక్షన్ అయితే ఒక్కరోజులో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు వెళ్లడానికి సమయం సరిపోతుందా? ఎలా వెళ్లాలో? తెలియక అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. గతంలో మెరిట్ జాబితాలు ప్రకటించిన తర్వాత కనీసం 15 రోజుల నుంచి మూడు నెలల వరకు గడువు ఇచ్చి సెలక్షన్ జాబితా ప్రకటించేవారని అభ్యర్థులు చెబుతున్నారు. కొన్ని డీఎస్సీల్లో మెరిట్ జాబితాలకు, సెలక్షన్ జాబితాలకు అరులనెలలకు పైగా గడువు ఉండేదని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడేమో రెండు రోజులు కూడా గడువు ఇవ్వకుండా హడావుడిగా సెలక్షన్ జాబితా విడుదల చేస్తూ సర్టిఫికెట్ల పరిశీలకు సిద్ధం చేస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మెరిట్ జాబితా పరిశీలించి తమకు పోస్టు వచ్చే అవకాశం ఉన్న రిజర్వేషన్ల అభ్యర్థులు కులం, ఆదాయం, స్టడీ తదితర సర్టిఫికెట్లు తెచ్చుకోవాలంటే సమయం సరిపోదని వాపోతున్నారు. జాబితాలను ప్రింట్ తీసుకున్న పలువురు అభ్యర్థులు తమకు వచ్చిన పాయింట్లు, ర్యాంకులపై లెక్కలు వేసుకుంటూ పోస్టు వచ్చే అవకాశాలపై తర్జనభర్జన పడుతున్నారు. ప్రధానంగా జిల్లాలో ప్రకటించిన పోస్టుల ఖాళీలకు అనుగుణంగా 'కటాఫ్' ఆయా కేటగిరిల్లో ఎక్కడికి ఆగిపోతుందనే అంశంపై అంచనా వేసుకుంటున్నారు. మంజూరు పోస్టులు, ఏ కేటగిరికి ఎన్ని పోస్టులు కేటాయించారనే జాబితానే తమకు వచ్చిన ర్యాంకులను పోల్చుకుంటూ కుస్తీ పడుతున్నారు. రిజర్వేషన్లు, లోకల్, నాన్‌లోకల్‌పై లెక్కలు కడుతూ అంచనా వేసుకుంటున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 446 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల 25న జిల్లా కేంద్రంలో చేపట్టడానికి జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. జిల్లా పోస్టులతో పాటు జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు ఎంపికైన జిల్లా అభ్యర్థులు కూడా సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశామని డీఈఓ యూ.మాణిక్యంనాయుడు తెలిపారు. విద్యార్హత, కులం, ఆదాయం, నేటివిటీ సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.

అందుబాటులో లేని 108



- 108పై కూటమి సర్కారు అలసత్వం
- పూర్తిస్థాయిలో సేవలు అందక రోగులు అవస్థలు
- జిల్లాలో 28 అంబులెన్సులు
- 15 రోజులుగా అందుబాటులో లేని గజపతినగరం, డెంకాడ వాహనాలు
- దీంతో పక్క మండలాల అంబులెన్సుల సేవలు

సేవల్లో జాప్యం..

108 అంబులెన్సుకు ఫోన్‌చేసిన 15, 20 నిమిషాల్లో సంఘటన స్థలానికి రావాల్సి ఉండగా 40 నుంచి 50 నిమిషాలు పడుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితి ఉన్న వారు ఇలాంటి సమయాల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆపదలో ఉన్న వారిని త్వరగా ఆస్పత్రికి చేర్చగలిగితే వారి ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది. సకాలంలో ఆస్పత్రికి చేర్చలేక పోతే పరిస్థితి విషమించే ప్రమాదంతో పాటు ఒక్కో సమయంలో ప్రాణాలు పోయే పరిస్థితి కూడా ఉంటుంది.

విజయనగరం ఫోర్ట్: 108 అంబులెన్సుల పట్ల కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంబులెన్సులు పూర్తిస్థాయిలో లేక పోవడంతో సేవలు సక్రమంగా అందడం లేదు. అంబులెన్సులు మరమ్మతుల బారిన పడితే వాటిని రోజుల తరబడి బాగుచేయించకపోవడం వల్ల సేవల్లో జాప్యం ఏర్పడుతోంది. దీంతో రోగులు ప్రైవేట్ అంబులెన్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చితే వారు బతికి బట్టగడతారు. అంబులెన్సులు సకాలంలో రాక పోవడం వల్ల రోగుల ప్రాణాలు మీదికి వస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 28 అంబులెన్సులు

విజయనగరం జిల్లాలో 28 అంబులెన్సులు ఉన్నాయి. వాటిలో రెండు అంబులెన్సులు అందుబాటులో లేవు. దీంతో పక్క మండలాల అంబులెన్సులు సేవలు అందించాల్సిన పరిస్థితి. రెండు మండలాల్లో ఒకేసారి కేసులు వస్తే ఒక మండలంలో ఉన్న రోగులకు అంబులెన్సులు బిజీగా ఉన్నాయని చెబుతున్నట్లు తెలుస్తోంది. గజపతినగరం, డెంకాడ అంబులెన్సులు గడిచిన 15 రోజులుగా అందుబాటులో లేవు. దీంతో గజపతినగరం మండలంలో రోగులకు అత్యవసర పరిస్థితి అయితే బొండపల్లి వాహనం వెళ్తుంది. అలాగే డెంకాడలో అంబులెన్సు లేక పోవడంతో విజయనగరం అంబులెన్సును వినియోగిస్తున్నారు.

విజయనగరం నియోజకవర్గానికి ఒకటే అంబులెన్సు

విజయనగరం నియోజకవర్గం మొత్తానికి ఒకే ఒక్క అంబులెన్సు ఉంది. ఈ అంబులెన్స్ డెంకాడ మండలంలో కేసులు వచ్చి వెళ్తే విజయనగరం నియోజకవర్గంలో కేసులకు సేవల్లో జాప్యం ఏర్పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయనగరం నియోజకవర్గంలో మొత్తం 6 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. దీంతో ఉన్న ఒక్క అంబులెన్సు పూర్తిస్థాయిలో సేవలు అందించలేని పరిస్థితి. విజయనగరం నియోజకవర్గానికే అదనంగా మరో రెండు, మూడు అంబులెన్సుల అవసరం ఉంటుంది. కానీ కూటమి సర్కార్ ఒక్క అంబులెన్సుతోనే కాలం వెళ్లదీస్తోంది. విజయనగరం నియోజకవర్గం ప్రజలతో పాటు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రినుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేసే రోగులను కూడా ఈ అంబులెన్సు ద్వారానే తరలిస్తున్నారు. విశాఖపట్నం రోగిని తరలించి తిరిగి రావడానికి 108 అంబులెన్సులకు మూడు నాలుగు గంటల సమయం పడుతుంది. అసమయంలో కేసులు వస్తే రోగులు ప్రైవేట్ అంబులెన్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

ప్రైవేట్ అంబులెన్సుల్లో తరలించడానికి వేలల్లో ఖర్చు

విజయనగరం జిల్లా నుంచి రోగులను విశాఖపట్నం తరలించడానికి రోగుల బంధువులకు వేలల్లో ఖర్చు అవుతోంది. ఇది రోగులకు అదనపు భారమే అయినా తప్పని పరిస్థితి. విశాఖపట్నం రోగిని తరలించడానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రైవేట్ అంబులెన్సుల సిబ్బంది వసూలు చేస్తున్నారు.

పాడయ్యాయి..

గజపతినగరం, డెంకాడ అంబులెన్సులు మరమ్మతుల కోసం విజయవాడ వెళ్లాయి. గజపతినగరానికి బొండపల్లి, డెంకాడకు విజయనగరం అంబులెన్స్ సేవలు అందిస్తున్నాయి.

ఎస్.మన్మథరావు, 108 జిల్లా మేనేజర్

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి

- గొల్లలపేటలో పార్టీ మారిన 20 కుటుంబాలు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు

విజయనగరం: కూటమి ప్రభుత్వం 14 నెలల ప్రజ్యావతిరేక పాలనతో విసుగుచెందిన టీడీపీకి చెందిన పలు కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు బూర రామునాయుడు, మాజీ సర్పంచ్ బూర రమణల ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో 20 కుటుంబాలకు చెందిన 40 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, గ్రామసర్పంచ్ బూర పైడమ్మలు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 14 నెలల పాలన చూసి విసుగు చెంది వైఎస్సార్‌సీపీలో చేరిన వారందరికీ స్వాగతం పలుకుతున్నామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో రాణించిన తలవరం విద్యార్థిని


సంజనకు జ్ఞాపిక అందజేస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

వీరఘట్టం: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సంజన ప్రతిభ కనబరిచింది. తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడు వద్ద యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో సంజన మూడో స్థానంలో నిలిచినట్లు యోగా గురువు జనార్దనరావు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన సంజనకు యోగాసన అసోసియేషన్ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. హెచ్ఎం ఎస్.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.రఘు, ధనలక్ష్మి, తదితరులు సంజనను అభినందించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్


పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

బొబ్బిలి రూరల్: మండలంలోని పాతపెంట గ్రామ సమీపంలోని తోటలో గొర్రెపందాలు నిర్వహిస్తున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సైలు రమేష్, జ్ఞానప్రసాద్, సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు చేపట్టగా పది మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్దనుంచి రెండు వేల రూపాయల నగదు.. రెండు పొట్టేళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా పూర్ణాహుతి


సూర్యసదనంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడిలోని గర్భాం రోడ్డులో గల సూర్య సదనంలో ఆదివారం పూర్ణాహుతి మహోత్సవం వైభవంగా జరిగింది. సూర్యసదనం ప్రధాన అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ రామానంద భారతిస్వామి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్త ఇప్పిలి శంకర్‌శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పక్కాగా విద్యాహక్కు చట్టం



మాట్లాడుతున్న ఆపుస్మా లీగల్ అడ్వైజర్ విజయ్

విజయనగరం అర్బన్: విద్యాహక్కు చట్టం పక్కాగా అమలు చేయాలని, చట్టంలో నిర్దేశించినవి అమలయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ఆపుస్మా) లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ్ కోరారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 12(1)(సి) చట్టం ప్రకారం ఇస్తున్న అడ్మిషన్లను గౌరవిస్తున్నామని, సెక్షన్ 12(2) ప్రకారం ఫీజులు నిర్ణయించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రైవేటు స్కూళ్లకు స్టార్ రేటింగ్స్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. మూడేళ్లుగా ప్రవేశాలు ఇచ్చినా ఫీజులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తున్నామన్నారు.

సమావేశంలో అసోసియేషన్ రిజిస్ట్రేషన్, సభ్యత్వ చందాలు, సబ్ కమిటీలు, మేనేజ్మెంట్ ఎనరిచ్‌మెంట్ ప్రొగ్రాంలపై తీర్మానాలు చేసి వాటిని ఆమోదించారు. సమావేశంలో అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు ఎంవీరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంఎఎస్ వెంకటరావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹21 6	₹236

ప్రకృతికి నచ్చేలా.. వినాయకుడు మెచ్చేలా..!

- మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న పాల్తేరు కళాకారులు
- తర తరాలుగా ఇదే వృత్తిలో రాణిస్తున్న కుమ్మరి కులస్తులు
- పాల్తేరు విగ్రహాలకు డిమాండ్


కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు


మట్టితో వినాయకుణ్ని తయారు చేస్తున్న శ్రీనివాసరావు


శివగణపతి బొమ్మకు మెరుగులు దిద్దుతున్న శంకరరావు

బాడంగి: మట్టి వినాయక విగ్రహాలకు మండలంలోని పాల్తేరు పెట్టింది పేరు. గ్రామానికి చెందిన కుమ్మరి కులస్తులు తరతరాలుగా మట్టి వినాయక, దుర్గాదేవి, నందీశ్వరులు, పార్వతీపరమేశ్వరుల విగ్రహాల తయారీతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. వీరు తయారు చేసే విగ్రహాలకు మార్కెట్‌లో ఎనలేని డిమాండ్ ఉంది. తరతరాలుగా వీరు మట్టి కుండలతో విగ్రహాలు తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వీరు విగ్రహాలు తయారు చేయడం విశేషం. కేవలం బంక మట్టితో పాటు సంప్రదాయ రంగులను మాత్రమే వాడుతారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విగ్రహాలు కొనుగోలు చేస్తారంటే వీరి పనితనం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇటీవల కాలంలో చాలా మంది తక్కువ ధరకు లభించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే బొమ్మల వైపు దృష్టి సారించడంతో వీరి వ్యాపారం కాస్త తగ్గింది. గతంలో వినాయక చవితి సీజన్‌లో ఒక్కో కుటుంబం వారు సుమారు రెండు లక్షల రూపాయల వరకు వ్యాపారం చేయగా.. ఈ ఏడాది మాత్రం అంత పెద్ద ఆర్డర్లు రాలేదని కళాకారులు చెబుతున్నారు. లాభాలు గడించాలంటే తాము కూడా పర్యావరణానికి చేటుచేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసేవారమని.. అయితే ప్రకృతిని దృష్టిలో పెట్టుకుని, పూర్వీకులు చెప్పిన మాట ప్రకారం లాభాలు తక్కువ వచ్చినా మట్టి విగ్రహాలనే తయారు చేస్తున్నామని తెలిపారు. తమలాంటి కళాకారులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందితే మరింతగా రాణిస్తామని చెబుతున్నారు.

ఆర్డర్లు తక్కువ..



గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఆర్డర్ల సంఖ్య తగ్గింది. మట్టి వినాయక విగ్రహాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. పర్యావరణానికి చేటుచేసే ఎటువంటి రసాయనాలు ఉపయోగించం. లాభం తక్కువ వచ్చినా మట్టి బొమ్మలనే తయారు చేస్తుంటాం. మేము తయారు చేసే విగ్రహాలకు జిల్లా వ్యాప్తంగా పేరుంది. – అమలాపురం శ్రీనివాసరావు, మట్టి విగ్రహాల కళాకారుడు, పాల్తేరు గ్రామం

ప్రోత్సాహం కరువు..



మాలాంటి కళాకారులను ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తాం. ప్రస్తుతం పోలీసు నిబంధనలు ఎక్కువ కావడంతో ఉత్సవాల నిర్వహణకు యువత ఆసక్తి కనబరచడం లేదు. అధికారులు, పర్యావరణ ప్రేమికులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తే మట్టి బొమ్మలకు గిరాకీ ఉంటుంది. మాలాంటి కళాకారులకు న్యాయం జరుగుతుంది. – సుంచెల సత్యనారాయణ, మట్టివిగ్రహాల కళాకారుడు, పాల్తేరు గ్రామం

సైబర్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య

- రిజర్వ్ బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య

విజయనగరం: సైబర్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఎటువంటి వ్యక్తిగత సమాచారం చేరవేయవద్దని రిజర్వ్ బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య సూచించారు. యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో 'బ్యాంకింగ్ సేవలు – సైబర్ మోసాలపై' ద్వారపూడి గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు, సామాజిక భద్రతా పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ షాలిని, రిజర్వ్‌బ్యాంక్ డీజీఎం కల్యాణ చక్రవర్తి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జితేంద్ర శర్మ, ద్వారపూడి సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మృణాళిని, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట రమణమూర్తి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు రాజా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదే..

- ఎస్పీ వకుల్ జిందల్


వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: వినాయక ఉత్సవాల్లో అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఎక్కడైనా అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మంటపాల ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీస్, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాలు సాఫీగా సాగేందుకు పోలీస్ సూచనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మంటపాలు ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాల్లో డీజేలను వినియోగించేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. మైక్‌సెట్లను నిర్ణీత సమయం వరకు మాత్రమే వేయాలని చెప్పారు. అలాగే సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనంలో ప్రమాదకర రంగులు చల్లుకోవడం.. బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సభ్యులపై చర్యలు తప్పవన్నారు.

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి నగరంలోని విజ్జి స్టేడియంలో అండర్–17 విభాగంలో బాల, బాలికలకు ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2009 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులన్నారు. అంతేకాకుండా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణపత్రం కలిగి ఉండాలని సూచించారు. క్రీడాకారులు తమ వ్యక్తిగత క్రీడా పరికరాలతో పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 30 నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 83747 37707 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నదీ తీరంలో హెచ్చరిక బోర్డులు : సబ్ కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని: మండలంలోని లివిరి వద్ద వంశధార నదిలో కుమ్మరి లక్ష్మి అనే మహిళ గల్లంతు కాగా ఆ నదీతీరాన్ని పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం పరిశీలించారు. మహిళ గల్లంతు ఘటనపై ఆరాతీశారు. తహసీల్దారు శివన్నారాయణ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలో జల్లెడ పడుతున్నా మహిళ ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ప్రమాదకరంగా ఉండే ఇటువంటి నదీతీరాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దారును సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఆదివారమూ ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యేక బోటు వేసుకుని మరీ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

వేధింపుల వల్లే ఆత్మహత్య

గజపతినగరం రూరల్: మండలంలోని పిడిశీలకు చెందిన కర్రోతు సాయిసుధ ఆత్మహత్యకు ప్రియుడి వేధింపులే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సాయిసుధకు అదే గ్రామానికి చెందిన యడ్ల ఈశ్వరరావుతో 11 ఏళ్లుగా పరిచయం ఉందన్నారు. కొద్దిరోజులుగా ఈశ్వరరావు నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో సాయిసుధ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కురుపాం విద్యార్థిని లాత్వికకు ఫ్రీ మెడికల్ సీటు

- మొదటి ప్రయత్నంలోనే గుంటూరులోని కాటూరి కళాశాలలో సీట్


కాదా లాత్విక

కురుపాం: కురుపాం మండల కేంద్రానికి చెందిన కాదా లాత్విక ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించింది.ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలోని బీసీ(బి) కేటగిరిలో మొదటి ప్రయత్నంలోనే 463 మార్కులు సాధించి 3743వ ర్యాంకును కైవసం చేసుకుని గుంటూరు లోని కాటూరి మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించింది. లాత్విక తండ్రి కాదా చంద్రమౌళి సాక్షి దిన పత్రిక కురుపాం రిపోర్టర్ గా, తల్లి అనూరాధ జియ్యమ్మవలస మండలంలోని రావాడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. మొదటి ప్రయత్నంలోనే తమ కుమార్తె లాత్విక ఉచిత సీటు సాధించడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.లాత్విక విశాఖపట్నం లోని శశి కళాశాలలో ఇంటర్ మీడియట్ అభ్యసించింది.

శభాష్..సమీర..!


పతివాడ సమీర

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ సమీర ఎంబీబీఎస్‌లో ఉచిత సీటును సాధించింది. ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షలో 2020వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్న సమీరకు గుంటూరులోని కాటూరి వైద్య కళాశాలలో ఉచిత సీటు లభించింది. సమీర తండ్రి పతివాడ త్రినాథ్ ఇదే మండలంలోని కుదిపి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఫ్రీ సీట్ సాధించిన సమీరను పలువురు అభినందించారు.

శారీరక చురుకుదనం లేకపోతే సమస్యలు

- ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి


సండే ఆన్ సైకిల్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది

పార్వతీపురం రూరల్: ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవన శైలిలో ద్విచక్ర వాహనాలు, కార్లు భాగమైపోవడంతో శారీరక శ్రమ ఉండడం లేదని ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి అన్నారు. శారీరక చురుకుదనం లేకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. క్విట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండే ఆన్ సైకిల్ పేరిట ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ కార్యాలయం నుంచి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ప్రతిరోజూ విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటారన్నారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరక దృఢత్వం వస్తుందని చెప్పారు. ర్యాలీలో ఏఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్సైలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత లేని గ్రామీణ వైద్యులపై చర్యలు

- జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్

కురుపాం/జియ్యమ్మవలస రూరల్: గ్రామీణ వైద్యులు విచ్చలవిడిగా యాంటీబయాటిక్ మందులు ఇస్తూ రోగుల అనారోగ్యానికి కారణమవుతున్నారని.. అర్హత లేని ఆర్ఎంపీలపై చర్యలు తప్పవని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్ అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్‌లకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మందుల షాపుల్లో పెద్ద మొత్తంలో యాంటీ బయాటిక్స్, యాంటీ మలేరియా, స్టెరాయిడ్స్‌ను నిల్వ ఉంచరాదన్నారు. అంతేకాకుండా రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, తనిఖీ సమయంలో అధికారులకు చూపించాలని సూచించారు. పేషెంట్లను వీలైనంతవరకు ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలన్నారు. గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలకు ఎట్టి పరిస్థితుల్లోను మందులు సరఫరా చేయొద్దని ఆదేశించారు. ప్రభుత్వ నిషేధిత మందులను పేషెంట్లకు డాక్టర్ చీటీ లేకుండా విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మెడికల్ షాపు యజమానులు తప్పనిసరిగా బిల్లు పుస్తకాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మందుల షాపుల యజమానులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



రాఘవ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీర రాఘవ (29) పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగొడబ గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకునిగా పనిచేస్తున్నాడు. అయితే రాఘవకు వచ్చే జీతం కన్నా ఖర్చులు ఎక్కువ కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండలంలోని ఆరికతోట పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాడంగి సీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై వి. ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


ఆస్పత్రి ఆవరణలో మృతదేహం

విజయనగరం క్రైమ్ : స్థానిక సర్వజన ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆస్పత్రి సిబ్బంది ఆదివారం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి ఆదేశాలతో హెచ్‌సీ అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మద్యం మత్తులో మృతి చెందాడా.. లేక ఇతర కారణాల వల్ల చనిపోయాడా అన్నది తేలాల్సి ఉంది. మృతుడు నీలిరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


అప్పలాచారి మృతదేహం

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సర్వజన ఆస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సీఆర్ నగర్‌కు చెందిన దేవు అప్పలాచారి (59) ఈ నెల 23వ తేదీన ఇంటిలో మెట్లపైనుంచి జారిపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. మృతుడి కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నా..లే నాన్న..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు


శ్రీనివాసరావు మృతదేహం


శ్రీనివాసరావు మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య మంగమ్మ, చిన్న కుమారుడు హర్ష

రామభద్రపురం: విద్యుదాఘాతంతో తండ్రి మృతి చెందగా.. అతని చేయి పట్టుకుని లే నాన్న.. లే అంటూ కుమారుడు రోదించిన తీరు చూసి అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు. మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. మండలంలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ గోదాం వద్ద విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జన్నివలస గ్రామానికి చెందిన ముచ్చుపల్లి శ్రీనివాసరావు అల్ట్రాటెక్ సిమెంట్ గోదాంలో కలాసీగా పనిచేస్తున్నాడు. అయితే సాయంత్రం పని ముగిసిన తర్వాత గోదాం వద్ద జీ వైర్‌పై ఆరబెట్టిన దుస్తులు తీసుకుంటుండగా విద్యుత్ షాక్ కొట్టింది. జీ వైర్‌కు పక్కనున్న విద్యుత్ స్తంభం వస్తున్న సర్వీస్ తీగ తగలడంతో విద్యుత్ ప్రవాహం జరిగి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంగ, కుమారులు రాము, హర్ష ఉన్నారు. రాము ఇంటర్మీడియట్, హర్ష పదో తరగతి చదువుతున్నారు. శ్రీనివాసరావు సంపాదన మీదే కుటుంబం ఆధారపడి ఉండడంతో.. ఇకపై ఎలా బతికేదంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వి. ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే యజమాని నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాసరావు మృతి చెందాడని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు.